శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త

## మళ్లీ వైఎస్సార్ సిపిదే అధికారం విజయసాయిరెడ్డి



### నెల్లూరు పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాలు గెలుస్తున్నాం

**నెల్లూరు రూరల్, జూన్ 2, ప్రభాతవార్త :** నెల్లూరు పార్లమెంటు స్థానంతో పాటు, దాని పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని నెల్లూరు వైఎస్ఆర్ సిపి ఎంపి అభ్యర్థి విజయసాయిరెడ్డి అన్నారు. నగరంలో రామూర్తి నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎన్నికల ఏజెంట్లతో కౌంటింగ్ రోజు అనుసరించాల్సిన తీరుపై నెల్లూరు ఎంపి అభ్యర్థి విజయసాయి రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ రోజున అప్రమత్తంగా ఉండాలని ఉండాలని వారికి దిశా నిర్దేశం చేశారు. పోస్టల్ బ్యాలెట్ దగ్గర నుండి ఈవీఎం దగ్గర కౌంటింగ్ రోజున ఏదైనా సమస్య వస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. కౌంటంగ్ మొదలైనప్పటి నుండి చివరి వరకు అక్కడే ప్రతీది క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రానుందని, అందులో ఎటువంటి సందేహం లేదన్నారు. పార్లమెంటు పరిధిలో ఎన్నికల రోజు నాడు చాలా బూత్‌లను పరిశీలించానని ప్రజలు మన పార్టీ పట్ల అనుకూలంగా ఉన్నారని తెలిపారు. మన పార్టీ 100కి 100 శాతం గెలుస్తుందని చెప్పారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు, మహిళలు, గ్రామీణులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారని ఆయన అన్నారు. టిడిపి, తదితర సంస్థలు నెల్లూరులో సిటీ, రూరల్, కోవూరు టిడిపి గెలవబోతుందన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. వైఎస్ఆర్‌సిపి నెల్లూరు పార్లమెంటు స్థానం, అలాగే ఏడు అసెంబ్లీ స్థానాలను గెలవబోతుందన్నారు. ప్రజా బలం మన పార్టీకే ఉందని ముఖ్యమంత్రి జగన్ చెప్పినట్టుగానే ప్రజలు మనకు ఓట్లు వేశారని తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన బూత్ ఏజెంట్లకు పార్టీ కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదులు తెలియజేసారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రజా బలంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముందుకెళ్తే, తెలుగుదేశం పార్టీ డబ్బు కట్టలతో రాజకీయం చేసిందన్నారు. నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని ప్రకటించిన తరువాత నుంచి పార్టీ మరింత బలోపేతం అయిందన్నారు.

## కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లు ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి కావలి ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి శీనానాయక్




**కావలి, జూన్ 2 ప్రభాతవార్త :** జూన్ 4వ తేది జరుగుతున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొంటున్న ఏజెంట్లు ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు ప్రవర్తించాలని కావలి ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి శీనానాయక్ తెలిపారు. కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం వివిధ పార్టీల ఏజెంట్లకు సమావేశం నిర్వహించి ఏజెంట్లు ఎలా వ్యవహరించాలో వారికి మార్గనిర్దేశం చేశారు. నెల్లూరులోని కౌంటింగ్ కేంద్రం వద్దకు నిర్దేశించిన సమయంలో ఏజెంట్లు అందరు రావాలన్నారు. అక్కడి నుంచి తీసుకెళ్తామన్నారు. ఏజెంట్లు సెల్‌ఫోన్లు, వాచీలు, ఎటువంటి వస్తువులు లేకుండా రావాలన్నారు. తెల్ల పేపర్లు వుంటే చాలన్నారు. పెన్నులు తనిఖీ చేసి ఇస్తామన్నారు. ఏజెంట్లు వివాదాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా సహకరించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు చాలా కఠినంగా వుంటాయన్న విషయాన్ని గుర్తు చేశారు. భారీ పోలీస్ బలగాల బందోబస్తు మధ్య ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఏజెంట్లకు పలు విషయాలపై అవగాహన కల్పిస్తూ సూచనలు అందజేశారు. ఈ సమావేశంలో కావలి డిఎస్పీ వెంకట రమణ, కావలి తహశీల్దార్ నగేష్, తదితరులు పాల్గొన్నారు. అన్ని పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి నారాయణ, గంట శ్రీనివాసరావులు



**నెల్లూరు, జూన్ 2, ప్రభాతవార్త - వైద్యం :** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని టిడిపి మాజీ మంత్రులు నారాయణ, గంట శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకున్నారు. వీఐపీ దర్శన ప్రారంభ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న నారాయణ, గంట శ్రీనివాసులకు టిడిపి అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని నారాయణ ఆక్షాంక్షించారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి నారాయణ



**నెల్లూరు, జూన్ 2, ప్రభాతవార్త - వైద్యం :** నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 4వ డివిజన్ కెపిఆర్ కళ్యాణ మండపంలో జరిగిన టిడిపి నేత, ఎన్టీఆర్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు అలీ కుమార్తె వివాహ కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిండు నూరేళ్ల కలకాలం సుఖంగా జీవించాలని నూతన దంపతులను ఆశీర్వదించారు. కలకాలం పిల్లాపాపలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ పొంగూరు నారాయణతో నూతన వధూవరుల ఫోటోలు దిగారు. తదనంతరం కళ్యాణ కార్యక్రమానికి విచ్చేసిన వారంతా నారాయణతో ఫోటీలు దిగేందుకు పోటీ పడ్డారు. వారందరినీ నారాయణ ఆప్యాయంగా పలకరించారు.

## నిండు నూరేళ్లు సంతోషంగా జీవించండి



**నెల్లూరు, జూన్ 2, ప్రభాతవార్త - వైద్యం :** నూతన వధూవరులను ఆశీర్వదించిన నారాయణ విద్యా సంస్థల జిఎం విజయ భాస్కర్ రెడ్డి నగరంలోని రంగనాయకులపేటలో అనిల్, జ్యోతిల వివాహ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణ విద్యా సంస్థల జీఎం విజయ భాస్కర్ రెడ్డి విచ్చేశారు. నూతన వధువులను ఆశీర్వదించారు. నిండు నూరేళ్ల, ఆయూర్ ఆరోగ్యాలు, అష్టైశ్వరాలు, పిల్లా పాపలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం నూతన వధూవరులతో ఆయన ఫోటో దిగారు.

## ఒంటివాహనంపైన అభయాంజనేయస్వామి వారు



**సంగం జూన్ 2 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని ఆత్మారామస్వామి వారి సన్నిధిలో హనుమజ్జయంతి పురస్కరించుకొని రాత్రి అభయాంజనేయస్వామి వారు ఒంటివాహనంపైన భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున గ్రామోత్సవంలో స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారిని గజమా లలతో అలంకరించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా జగన్నాధం వెంకటేశ్వర్లు, జగన్నాధం ఏడుకొండలు, జగన్నాధం వెంకటనరసయ్య కుటుంబసభ్యులు వ్యవహారి ంచారు.

## రెండో విడత కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**నెల్లూరు అర్బన్, జూన్2, ప్రభాతవార్త :** 2024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఆన్‌లైన్ పద్ధతిలో సిబ్బందిని కేటాయిస్తూ రెండోవిడత కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కౌటింగ్ అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో అన్లైన్‌లో కౌటింగ్ సిబ్బంది కేటాయింపునకు సంబంధించి రెండోవిడత రాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో పూర్తిచేశారు. ఈ కార్యక్రమంలో కౌంటింగ్ అబ్జర్వర్లు నితిన్‌సింగ్ బదారియా, జయేంద్ర కుమార్ విజయవత్, అభిలాష్ కుమార్ టీజీ, రిటర్నింగ్ అధికారులు చిన్న ఓబులేసు, మలోల, శీనానాయక్, ప్రేమ్‌కుమార్, డిఆర్ఓ లవన్న, ఎన్ఐసి జిల్లా సమాచార అధికారి సురేష్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఈసీ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్
### రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం



**నెల్లూరు క్రైం, జూన్ 2, ప్రభాతవార్త :** జూన్ 4న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో జరగనున్న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా, ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు టౌన్ రూరల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించి, కౌంటింగ్ కేంద్రంలో ఏజంట్లు వ్యవహరించవల్సిన తీరు, ఎన్నికల నిబంధనలను వివరిస్తూ కౌంటింగ్ ఏజెంట్లతో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదివారం స్థానిక ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ రోజు, ఆ తదుపరి, ఎగ్జిట్ పోల్స్ అనంతరం ఎటువంటి సంఘటనలు లేకుండా సహకరించడం పట్ల తొలుత అందరికీ అభినందనలు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గొడవలు విద్వేషాలు అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టు ప్రక్కల మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కౌంటింగ్ కేంద్రాలకు వెళ్ళు ఏజెంట్లు సంబంధిత అధికారుల నుండి జారీ చేయబడిన గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకువెళ్ళాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చేవారు మొబైల్స్ ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు, అగ్గి పెట్టెలు, సిగరెట్లు, పెన్ లేదా పేపర్ ఎట్టి పరిస్థితుల్లో తీసుకురాకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు వారి ఏజెంట్లు మినహా ఇతరులు ఎవ్వరూ రావడానికి అనుమతి లేదు. తీసుకురావద్దని తెలిపారు. 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా ఉండరాదని సూచించారు. కౌంటింగ్ కేంద్ర ప్రవేశ ద్వారం వద్ద విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది లోపలికి వచ్చు ప్రతి ఒక్కరిని తనిఖీ చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఏజెంట్లు ఒక్కసారి కౌంటింగ్ కేంద్రం లోపలికి వెళ్లిన తర్వాత కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు బయటకు వెళ్లడానికి వీలు లేదు ఏదైనా అనారోగ్య సమస్యలు ఉంటే ముందుగానే వాటికి సంబంధించిన మందులు వెంట తెచ్చుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, డిజే సౌండ్స్, బాణాసంచా కాల్చుటకు అనుమతిలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ఊహాజనిత వార్తలను నమ్మి ఎట్టి పరిస్థితుల్లో వాటికి స్పందించరాదు, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు, పోస్టులు పెట్టినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడుతాయని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్ల వాహనాలను జడ్పి హైస్కూల్‌లో నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా ఫలితాలు వచ్చిన అనంతరం ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు పోలీసు వారికి సహకారం అందిస్తారని, భద్రతాపరంగా ఎటువంటి సమస్య ఉన్నా సంప్రదించవచ్చని తెలిపారు.



## కౌంటింగు పట్ల అప్రమత్తంగా ఉండండి-ఇంటూరి

**కందుకూరు జూన్ 2, ప్రభాతవార్త :** ఈ నెల 4వ తేదీన జరుగు ఎన్నికల కౌంటింగు పట్ల అప్రమత్తంగా ఉండాలని కందుకూరు ఎమ్మెల్యే తెదేపా కూటమి అభ్యర్ధి ఇంటూరి నాగేశ్వరరావు ఏజెంట్లుకు సూచించారు. ఆదివారం కందుకూరు టీడీపీ కార్యాలయంలో కౌంటింగు ఏజెంట్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌లవారీగా ఈవీఎం నెంబర్లను, అలాగే పోలైన ఓట్లను తప్పకుండా సరిచూసుకోవాలన్నారు. టెక్నికల్‌గా ఎలాంటి అనుమానం వచ్చిన చీఫ్ ఎజెంట్‌లేదా లీగల్ సెల్‌ను సంప్రదించాలన్నారు. వైసీపీ ఏజెంట్లు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దొన్నారు. కౌంటింగు ప్రక్రియ ముగిసే వరకు హాలులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్లు శ్రీధర్ నాయుడు, బెజవాడ కృష్ణయ్య, చిడిపోతు హరికృష్ణలు ఏజంట్లుకు అవగాహన కల్పించా రు. తెదేపా మండల పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య, సీనియర్‌నేతలు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, బద్దిపూడి శిఖామణి, ముచ్చు శ్రీనివాసులు, ముచ్చు ఓంకారయ్య తదితరులు పాల్గొన్నారు.



## కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి

**ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కౌటింగ్ ప్రక్రియ, ఎటువంటి గొడవలు, వాగ్వివాదాలకు తావులేదు .కౌటింగ్ ప్రక్రియలో ఏ చిన్న సందేహం ఉన్నా వెంటనే పరిష్కరిస్తాం ,జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్**



**నెల్లూరు అర్బన్, జూన్2, ప్రభాతవార్త :** 2024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రాజకీయపార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు భారత ఎన్నికల సంఘం పేర్కొన్న నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో రాజకీయపార్టీల అభ్యర్థుల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసీఐ తాజాగా జారీచేసిన ఉత్తర్వులపై రాజకీయపార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించి కౌటింగ్ ఏజెంట్లకు వివరించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల పాటిస్తూ పూర్తి పారదర్శకంగా కౌటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని, రాజకీయపార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు ఈసీఐ నిబంధనలపై అవగాహన కలిగి జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు సంబంధించి ఈసీఐ తాజా ఉత్తర్వుల మేరకు డిక్లరేషన్ ఫారంలో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం ఉంటే సరిపోతుందని, ఎటువంటి సీలు లేకపోయినా ఓటు చెల్లుతుందని చెప్పారు. అలాగే ఎలక్ట్రానికల్లి ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల క్యూఆర్ కోడ్ స్కానింగ్ సమయంలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే ఎలా పరిష్కరించాలో కూడా ఈసీఐ తెలిపిందని, ఈ మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌటింగ్ పూర్తయిన తర్వాత రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు వివిప్యాట్ మెమరీ చీప్‌ను పరిశీలించుకునేందుకు ఈసీఐ ఉత్తర్వులు ఇచ్చిందని, ఈ మేరకు రెండు, మూడుస్థానాల్లో నిలిచిన అభ్యర్థులు కోరుకుంటే వివిప్యాట్ మెమరీ చీప్‌ను పరిశీలించుకునే అవకాశం కల్పిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. కౌంటింగ్ ఏజెంట్లు కౌటింగ్ కేంద్రం గేటు బయట ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ డిపాజిట్ కేంద్రంలో తమ ఫోన్లు డిపాజిట్ చేయాలని, అభ్యర్థులు, చీఫ్ ఏజెంట్లు మాత్రం కౌంటింగ్ కేంద్రంలోపల అవరణలో ఏర్పాటుచేసిన పబ్లిక్ రిప్రజెంటేటివ్ గదిలో తమ ఫోన్లు వినియోగించుకోవచ్చని, అక్కడే భద్రపరు చుకోవాలన్నారు. కౌటింగ్ హాళ్లలోని అభ్యర్థులు, ఏజెంట్లు సెల్‌ఫోన్లు అనుమతించమని స్పష్టం చేశారు. అలాగే కౌటింగ్ ఏజెంట్ల వాహనాలకు కౌంటింగ్ కేంద్రం సమీపంలో ఉన్న జడ్పీ హైస్కూల్ వరకే అనుమతి ఉంటుందని, అక్కడి నుండి కౌటింగ్ కేంద్రానికి చేరుకునేందుకు బస్సులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. అభ్యర్థులు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ల వాహనాలకు మాత్రం కౌంటింగ్ కేంద్రం గేటు బయట 100మీటర్ల వరకు అనుమతి ఉంటుందని, అక్కడి వదిలిపెట్టిన వెంటనే తిరిగి జడ్పీ హైస్కూల్లో పార్కింగ్ ప్రదేశాలకు వాహనాలను పార్కింగ్‌చేసుకోవాలన్నారు. ఈసీఐ నిబంధనలను పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తియ్యేందుకు అభ్యర్థులు, ఏజెంట్లు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఆర్‌వో లవన్న, టీడీపీ నుండి రూప్‌కుమార్ యాదవ్, వైసీపీ నుండి సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి నారాయణ



**నెల్లూరు కల్చరల్ 2, ప్రభాతవార్త :** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని టీడీపీ మాజీ మంత్రులు నారాయణ, గంట శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకున్నారు. వీఐపీ దర్శన ప్రారంభ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న నారాయణ, గంటకు టీటీడీ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని నారాయణ ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు తీర్ధ ప్రసాదాలు అందించారు.

## హంసవాహనంపై చదువులతల్లిగా కామాక్షితాయి



**బుచ్చి, జూన్ 2, ప్రభాతవార్త :** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడ లోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా కామాక్షితాయి హంసవాహనంపైన వీణ పట్టుకొని చదువుల తల్లిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పరవశించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా లేబూరు శ్రీనివాసులురెడ్డి, లేబూరు వెంకటరామి రెడ్డి, లేబూరు రాధాకృష్ణారెడ్డి, లేబూరు సుబ్బరామిరెడ్డి రేబాల వారు వ్యవహారించారు. తిరుచా ఉత్సవం ఉభయకర్తలుగా కీర్తిశేషులు శ్రీశైలం మల్లికార్జునశర్మ కుమారులు శ్రీశైలం సురేష్‌శర్మ, శ్రీశైలం శశిశేఖర్ శర్మ, ఉపప్రధాన కార్యదర్శి వ్యహారించారు. కార్య క్రమాలను ఆలయ ఇఒ విరుపార్జుల గిరికృష్ణా పర్యవేక్షించారు.

## కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డితో బుర్రా మధుసూదన్ యాదవ్ బేటీ



**కందుకూరు, జూన్ 2, ప్రభాతవార్త :** జూన్ 4 ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపధ్యంలో కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డితో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన బుర్రా మధుసూధన్ యాధవ్ ఆదివారం బేటీ అయ్యారు.మహీధరరెడ్డి క్యాంపు కార్యాలయంలో కలసిన ఇరువురు నేతలు స్థానిక ,రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు.

## మానసిక ఆనందం కోసం పోటీలు



**ఉలవపాడు, జూన్ 2, ప్రభాతవార్త :** విద్యార్థులకు మానసిక ఆనందం కోసం పోటీలు నిర్వహిస్తున్న గ్రంధపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా ఉలవపాడు శాఖా గ్రంధాలయంలో పాఠశాల విద్యార్థులతో ముందుగా నీతి కథలు, జాతీయ నాయకులు జీవిత చరిత్రలు తదితర పుస్తకాలు చదివించి తరువాత పిల్ల మానసిక ఆనందం కోసం స్పీడ్ వాక్ పోటీలు నిర్వహించారు. రోజు జరుగుతున్న వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు క్యాంప్ చివరి రోజు ఈనెల 7న చింతంకోటారెడ్డి జ్ఞాపకార్ధం వారి మనువడు చింతం నిశాంత్‌రెడ్డి బహుమతులు అందజేస్తారని అన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో 47 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలియజేశారు.

## చేజర్ల నివాళులు



**కోవూరు, జూన్ 2 ప్రభాతవార్త :** కోవూరుకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు అమ్మమ్మ ఎన్. సుబ్బమ్మ ఆదివారం మృతిచెందారు. ఈ మేరకు మృతదేహానికి జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు రామారావు, విజయ్, మురళీకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

## చేజర్లలలో ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



**చేజర్ల జూన్ 2 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలో హనుమజ్జయంతి వేడుకలను ఆదివారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చేజర్ల బస్టాండ్ సెంటర్‌లో ఉన్నటువంటి హనుమంతుని విగ్రహానికి పూలమాల వేసి విశేష పూజలు నిర్వహించారు. స్థానికంగా ఉన్నటువంటి సొసైటీ అధ్యక్షులు బోధళ్ల వీరరాఘవరెడ్డి, సతీమణి విజయ ఆద్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఎనమదల గ్రామంలో ఉన్నటువంటి అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద తమలపాకులతో ఆంజనేయస్వామి ప్రత్యేక మాల దరించారు. అలాగే పూజా కార్యక్రమాలు నిర్వహించి రాత్రికి అన్నదానన కార్యక్రమం నిర్వహించారు.అన్నదాన కార్యక్రమానికి ఉభయకర్తలుగా మల్లినేని సుబ్బయ్య,కామేశ్వరమ్మ వ్యవహారించారు. మండలంలోని పలు గ్రామంలలో హనుమజ్జయంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో గ్రామస్తులు రావి పెంచలరెడ్డి, షేక్ సిరాజ్‌ద్దీన్, అరవగోపిరెడ్డి, అరవదామోదర్‌రెడ్డి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## వింధ్యపరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు



**వింజమూరు,జూన్2,ప్రభాతవార్త :** వింజమూరుకు నైరుతీదిక్కున కొండపై వెలసియున్న శ్రీవింధ్యపరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు 4వ తేదీ నుండి ప్రారంభమవుతాయని వింజేటమ్మ భక్తబృందం తెలిపారు. వింధ్యపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరిగి 19వసంతాలు పూర్తిచేసుకొని 20వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. 4వ తేదీ మంగళవారం అంకురార్పణ, ఉభయదాతలు పి.ముఖేష్-సీతాదేవి, శ్రీరాందేవ్ స్వీట్స్, 5వ తేదీ బుధవారం మహాలక్ష్మి అలంకారం, ఉభయదాతలు మోటచింతలపాళెం గ్రామస్తులు, 6వ తేదీ పార్వతీదేవి అలంకారం, ఉభయదాతలు కలిగిరి మండలం గంగిరెడ్డిపాళెం గ్రామస్తులు, 7వ తేదీ సరస్వతీదేవి అలంకారం , ఉభయదాతలు లెక్కలవారిపాళెం గ్రామస్తులు, 8న శాంతిస్వరూపిణి అలంకారం , ఉభయదాతలు వింజమూరు భక్తబృందం నిర్వహించనున్నారని వారు తెలిపారు. శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఉభయకర్తలుగా పొడమేకల నాగయ్య-విజయలక్ష్మిలు వ్యవహరించనున్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఉభయకర్తలు కోరారు.

## వడదెబ్బతో బేల్దారి కూలీ మృతి



**కోవూరు, జూన్ 2 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు గ్రామానికి చెందిన తుమ్మల మధు బేల్దారి పనులు చేస్తూ కుటుంబంను పోషిస్తున్నాడు. యథావిధిగా ఆదివారం కూడా పనులకు వెళ్లాడు. ఈ మేరకు తీవ్రమైన వడదెబ్బకు గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంటనే మధును ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబాన్ని పోషిస్తున్న మధు ఆకస్మిక మరణం ఆ కుటుంబలో తీరని విషాదాన్ని కలిగించింది.

## కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠినచర్యలు



**వింజమూరు,జూన్2,ప్రభాతవార్త :** సార్వత్రిక ఎన్నికల ఓట్లలెక్కింపు సందర్భంగా ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సిఐడి అడిషనల్ ఎస్పీ ఉమామహేశ్వర రావ్ పేర్కొన్నారు. ఆదివారం వింజమూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ఎస్ఐలతో , వివిధ పార్టీల సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో అక్కడక్కడ జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని గతంలో కూడా జరిగిన సంఘటనలపై దృష్టిసారించి స్టేషన్ పరిధిలో పార్టీ ముఖ్య నేతలతో సోషల్ మీడియా ప్రతినిధులకు అవగాహన కల్పించాలన్నారు. ఎలక్షన్ నిబంధనలు అమలులో ఉన్నందున కౌంటింగ్ ముందు , కౌంటింగ్‌కు తర్వాత సమన్వయం పాటించాలన్నారు. ఉద్వేగాలకు లోనుకాకూడదని, రెచ్చగొట్టే కార్యక్రమాలు చేయరాదని, బాణాసంచా , ఊరేగింపులు చేయరాదన్నారు. ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనలు ప్రస్తుతం కౌంటింగ్ దృష్ట్యా భద్రతా చర్యలను చేపట్టామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పర్యటిస్తూ ఆప్రాంతవాసులకు ఎన్నికలు కౌంటింగ్ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే చర్యలు కఠినంగా ఉంటాయని, పోలీసు రికార్డుల్లో నమోదవుతారన్నారు. ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ నియమనిబంధనలు పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో వింజమూరు ఎస్ఐ కోటిరెడ్డి, కలిగిరి ఎస్ఐ సంతోష్‌కుమార్‌రెడ్డి, జలదంకి ఎస్ఐ ఆదిలక్ష్మి, సీతారామపురం ఎస్ఐ అనూష, వరికుంటపాడు ఎస్ఐ తిరుపతయ్య, దుత్తలూరుఎస్ఐ ఉమాశంకర్, ఉదయగిరి ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి, సోషల్‌మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు

## పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి

- సందడి చేసిన 1983-84 బ్యాచ్



**కోవూరు, జూన్ 2 ప్రభాతవార్త :** పాఠశాలల్లో తాము చేసిన అల్లరి పనులు పాఠశాలలో ఉపాధ్యాయులతో తాము ప్రవర్తించిన తీరు, ఉపాధ్యాయులు బోధించిన వ్యవహారం తదితర విషయాలపై 1983-84 సంవత్సరంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థినులంతా 40 సంవత్సరాల తర్వాత ఒక చోటున చేరి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ పాఠశాలలో ఏ బెంచ్‌లో కూర్చున్నాము.. ఏయే కార్యక్రమాలు చేశాము అని ఒకసారి గుర్తుకు తెచ్చుకున్నారు. ఆదివారం ఈ విద్యార్థినులంతా కోవూరులోని ఒక ప్రైవేట్ అతిథి గృహంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసుకుని సంతోషంగా తమ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ప్రస్తుతం వారంతా ఏయే రంగంలో ఉన్నారు.. ఎక్కడ స్థిరపడ్డారు అని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు తమకు చదువు చెప్పిన పాఠశాలకు ఏమైనా చేయాలని ఈ సందర్భంగా వారు నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి స్వర్ణ, నాగలక్ష్మి, పార్వతి, బి. జ్యోతి, కామాక్షి, గీత, సీహెచ్ జ్యోతి, సుభాషిణి, ఆదిలక్ష్మి, మాధవి, భాను, రత్న, పి. జ్యోతి, అమ్మణ్ణి, రాజేశ్వరి, తదితరులు ఉన్నారు. .

# వైభవంగా హనుమాన్ శోభ యాత్ర

**కోవూరు, జూన్ 2 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ శోభాయాత్రకు సంబంధించి బీజేపీ కరసేవకులు , ఇతర అభిమానులు పెద్ద ఎత్తున జై హనుమాన్ అంటూ ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించుకుని అక్కడి నుంచి నెల్లూరుకు భారీ మోటార్ సైకిళ్లలో జై హనుమాన్ అంటూ నినాదాలు చేస్తూ కాషాయ జెండాలు పట్టి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కోవూరు పురవీధుల్లో ఈ ర్యాలీ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది.





ఫోటోలు : నంద మాల్యాద్రి

## దేవాంగ సంక్షేమ సంఘంచే ప్రతిభా పురస్కారాల అవార్డుల వేడుక



**నెల్లూరు టౌన్, జూన్ 2, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన పదో తరగతి, ఇంటర్మీడియట్ దేవాంగ విద్యార్థినీ, విద్యార్థులకు స్థానిక పొదలకూరు రోడ్డు నందు గల హెచ్ఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా ప్రతిభా పురస్కారాల అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తమకున్న నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల మరియు జన్మభూమి రుణం తీర్చుకోవాలని సూచించారు. నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ మన్యం సతీష్ మాట్లాడుతూ కఠోర శ్రమ క్రమశిక్షణ, అంకితభావంతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తద్వారా సమాజంలో మీకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అన్నారు. కేవలం రాజకీయంగానే గుర్తింపు పొందుతారని భావన నుండి విద్యార్థులు బయటకు వచ్చి సమాజంలో ఉద్యోగ రీత్యా మెరుగైన సేవలందించేందుకు ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉద్యోగాలు సంపాదించడం ద్వారా కూడా సాధించుకోవచ్చని అన్నారు. అసోసియేట్ అధ్యక్షులు సజ్జ వెంకట సురేష్ మాట్లాడుతూ నేటి కాలంలో వివిధ రంగాల్లో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రులు విద్యార్థుల ఆలోచన ఆసక్తికి తగిన విధంగా వారిని ప్రోత్సహించినట్లయితే మంచి ఫలితాలు సాధించగలుగుతారని అన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సజ్జ సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యం, అభివృద్ధితో కూడిన విద్యను అభ్యసంచి ఇతరులకు ఉపయోగపడే విధంగా ఎదగాలని సూచించారు. ఇంకనూ ఈ కార్యక్రమంలో రాఘవ పౌల్ట్రీ అధినేత కర్ణ రాఘవరావు, శివసాయి ఆక్వా ఎక్స్పోర్ట్స్ అధినేత పముజుల రవి, కోశాదికారి కొండా మాధవరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మానద ఉదయభాస్కర్, బత్తిన శ్రీనివాసులు, సజ్జ నవోదయ, బండ్ల హైమావతి, నాప ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## కావలి ఎమ్మెస్సార్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్



**కావలి, జూన్ 2 ప్రభాతవార్త :** కావలి పట్టణ కోఆపరేటివ్ కాలనీలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో సోమవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి తెలిపారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బెంగుళూరు వేదికగా గల రైనెక్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కావలి ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నారన్నారు. ఇన్‌సైడ్ సేల్స్ స్టాటెజిస్ట్‌గా జాబ్ రోల్ వుంటుందని తెలిపారు. గ్రూప్ డిస్కషన్, పర్సనల్ రౌండ్స్ పూర్తి చేసుకొని ఎంపికైన వారికి వార్షిక వేతనం 5.2 లక్షలు వుంటుందని తెలిపారు. ఏ కళాశాలలోనైనా డిగ్రీ, పిజి ఉత్తీర్ణులైన వారు తమ బయోడేటాతో ఈ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో పాల్గొనవచ్చని రాజ్‌కుమార్ తెలిపారు.

## వైభవంగా శ్రీ హనుమ ప్రాకార ఉత్సవం



**బిట్రగుంట, జూన్ 2 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన బోగోలులోని శ్రీ చెన్నకేశవ, ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా వైభవంగా శ్రీ హనుమ ప్రాకార ఉత్సవం నిర్వహించారు. శ్రీ హనుమంతు నికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు హనుమాన్ చాలీసా పఠనం, ఆకుపూజ, సింధూర అర్చన నిర్వహించారు. భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేద్దాం




**కావలి, జూన్ 2 ప్రభాతవార్త :** ఎన్నికలలో విజయం కోసం కష్టపడి పనిచేసిన వైసిపి నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లు ఓట్ల లెక్కింపు రోజున ఎంతో అప్రమత్తంగా వుండాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అధికారులు నిష్పక్షపాతంగా, సజావుగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా వ్యవహరిస్తారని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫలితాల అనంతరం కూడా ఎక్కడా ఎలాంటి ఘర్షణ వాతావరణానికి చోటు ఇవ్వవద్దని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సమన్వయంతో అందరు సంయమనం పాటించాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ దిశగా పయనించాలన్నారు. అధికారులు కూడా సహకరించాలని తెలిపారు.

## శ్యామలని సన్మానించిన హంస

**నెల్లూరు, జూన్ 2, ప్రభాతవార్త - వైద్యం :** శుక్రవారం సాయంత్రం కోవూరు మండలం గంగవరం గ్రామం రామచంద్రపురం కాలనీకి చెందిన ఏసోబు విద్యుత్ షాక్‌తో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన వ్యక్తికి సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడటంతో పాటు అత్యవసర వైద్యం కోసం 108కి కాల్ చేసి హాస్పిటల్‌కి తీసుకువెళ్లి ప్రాణాలు రక్షించిన ఏఎన్ఎం సర్వేపల్లి శ్యామల, ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారిని జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు గౌరవ అధ్యక్షులు డాక్టర్ వై వెంకటేశ్వర్లు పిపి యూనిట్, జిల్లా జనరల్ సెక్రటరీ కమల్ కిరణ్ ఘనంగా అభినందించి సత్కరించడం జరిగింది. సంఘటన జరిగిన టైంలో అటుగా వెళుతున్న శ్యామల నాకెందుకులే అనుకోకుండా వెళ్లి సిపిఆర్ చేయడం స్థానిక యువకుల సపోర్టుతో మెడికల్ పరంగా చేయవల్సిన మెడికల్ ఎమర్జెన్సీ టెక్నిక్స్ ఉపయోగించి ప్రాణాలు కాపాడడం అభినందనీయమని, కరెంట్ షాక్ తగిలిన వారి దగ్గరకు వెళ్లేందుకు చాలా భయపడి పరిస్థితి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో ప్రాణాలు సైతం తెగించి కరెంట్ షాక్ తగిలి పడిపోయిన వ్యక్తిని కాపాడడం గొప్ప విషయం అని, జిల్లాలోని వైద్య ఉద్యోగులందరికీ ఇది గర్వకారణం అని, నెల్లూరు జిల్లాలోని వైద్య సిబ్బందికి ఆశావాలంటీర్లకు సిపిఆర్ పై ఎప్పటికప్పుడు లేటెస్ట్ విధానాలతో శిక్షణ ఇప్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్యని కూడా రిక్వెస్ట్ చేయడం జరుగుతుందని, తద్వారా అనేక మంది ప్రాణాలు కాపాడడం జరిగిందని, ఈ విధంగా సేవ చేయడం చాలా సంతోషంగా భావిస్తాను అన్నారు. గతంలో నెల్లూరు ట్రైన్ యాక్సిడెంట్ 11 భోగిలలో మంటల్లో చిక్కుకుపోయిన ప్యాసింజర్లకు అత్యవసర వైద్య సేవలో అందించే క్రమంలో కూడా తమ వంతుగా సేవ చేయడం జరిగిందన్నారు. సర్వేపల్లి శ్యామలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ట్రెజరర్ మజారుల్లా, మహిళా విభాగం సెక్రటరీ ఉమామహేశ్వరి వైద్య ఉద్యోగులు శ్రీనివాసులు ఆదిలక్ష్మి తదితరులు అభినందించారు.

## ప్రసన్న గెలవాలని చెంగాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**కోవూరు, జూన్ 2 ప్రభాతవార్త :** కోవూరు శాసనసభ్యులుగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఏడవ సారి గెలుపొందాలని కోరుతూ పడుగుపాడు జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి ఆదివారం సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరలా రాష్ట్రంలో వైసీపీ అధికారం లోకి రావడం ఖాయమని, ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డి గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు నేరుగా అందించిన సంక్షేమ ఫలాలే వైసీపీకి శ్రీరామరక్ష అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అంతకుముందు ఆలయంలో మిత్రులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# కోవూరులో పీఠం ఎవరిది ?






– గెలుపుపై ఇరు పార్టీల్లో ధీమా

**కోవూరు, జూన్ 2 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గానికి సంబంధించి సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత అటు తెలుగుదేశం, ఇటు వైసీపీ పార్టీల్లో గెలుపుపై ధీమా నెలకొంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, సచివాలయ , వలంటీర్ వ్యవస్థ, నాడు-నేడు తదితర అభివృద్ధి పనులు వైసీపీ అభ్యర్థిగా ప్రసన్నకుమార్‌రెడ్డి గెలుపుకు కారణమవుతాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు తెలుగుదేశం పార్టీ మాత్రం ఈ సారి కోవూరు నియోజకవర్గంలో ప్రజల్లో మార్పు కోరుకుంటున్నారని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ 6 పథకాలు కోవూరు నియోజకవర్గ ప్రజలను, ముఖ్యంగా మహిళలను ఎంతగానో ఆకట్టుకున్నాయని, దీంతో టీడీపీ అభ్యర్థి గెలుపు తథ్యమని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు నియోజకవర్గంలో 8 సార్లు పోటీ చేయగా 6 సార్లు విజయం సాధించారు. రెండు సార్లు ఓటమి పాలయ్యారు. జిల్లాలో రాజకీయాల్లో సీనియర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకుని కోవూరు నియోజకవర్గాన్ని తమ కంచుకోటగా మలుచుకున్నారు. అయితే ఎన్నికల డేట్ ప్రకటించక ముందు వైసీపీలో ఉన్న వేమిరెడ్డి దంపతులు ఊహించని పరిణామాల కారణంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరడంతో జిల్లా వైసీపీలో ఒక్కసారి సంక్షోభం నెలకొంది. అప్పటివరకు పార్టీకి ఆయువుపట్టుగా ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఆ పార్టీలో నూతన జలసత్వాలు చేరుకున్నాయి. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న టీడీపీ అభ్యర్థుల్లో ఒక విధమైన భరోసా కలిగింది. ప్రసన్నకుమార్‌రెడ్డి మాత్రం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో లక్షకు పైగా గడపలు తిరిగి ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వారితో పంచుకోవడమే కాకుండా తన తండ్రి శ్రీనివాసులురెడ్డి చారిటుబల్ ట్రస్టు ద్వారా ఎంతోమంది అనాథలను, అభాగ్యులను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆదుకున్నారు. ఎన్నికల తేది ప్రకటించినప్పటి నుంచి టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి 40 రోజుల పాటు కోవూరు నియోజకవర్గంలో పర్యటించి తామేమీ రాజకీయాల్లో దోచుకోవడానికి రాలేదని, ప్రజలకు సేవ చేసేందుకే వచ్చామని ప్రజలకు వివరిస్తూ ప్రజల హృదయాల్లో చోటు దక్కించుకున్నారు. కేవలం ఒక సేవకురాలి లాగా ప్రజలకు సేవ చేసేందుకే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చామని చెబుతూ తమ ప్రసంగాలను కొనసాగించారు. మరోవైపు ప్రసన్నకుమార్‌రెడ్డి మాత్రం నెల్లూరు సిటీలో ముస్లిం మైనార్టీ అభ్యర్థికి ముఖ్యమంత్రి సీటు ప్రకటిస్తే దానిని చూసి ఓర్వలేక వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్టీ ఫిరాయించారని ఘాటు విమర్శలు చేశారు. ఆరేళ్ల పాటు రాజ్యసభ సభ్యత్వం , ఉత్తర భారతదేశంలో టీటీడీ చైర్మన్ పదవులను అనుభవించిన వేమిరెడ్డి దంపతులు పార్టీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరారన్నారు. అదేవిధంగా ప్రశాంతిరెడ్డి కాశీలో కోటి రూపాయలకు పైగా షాపుల వారికి అప్పు పెట్టి అక్కడి నుంచి పారిపోయారని కూడా విమర్శలు చేశారు. ఈ విధమైన విమర్శలకు ప్రశాంతిరెడ్డి కూడా గట్టిగా సమాధానమిచ్చారు. ప్రశాంతిరెడ్డి టీడీపీలో చేరినప్పటి నుంచి బుచ్చి , ఇందుకూరుపేట, విడవలూరు మండలాల నుంచి వైసీపీ చెందిన సీనియర్ నాయకులు ఎంతో మంది టీడీపీలో చేరారు. వీరంతా రావడంతో తెలుగుదేశం పార్టీకి అదనపు బలం చేకూరిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కోవూరు నియోజకవర్గ ప్రజలు ఎంతో విజ్ఞులని, తప్పనిసరిగా ఈ సారి మార్పు కోరుకుంటున్నారని, తెలుగుదేశం పార్టీ భావిస్తుండగా.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తమ పార్టీ అభ్యర్థి గెలుపుకు శ్రీరామరక్ష అని వైసీపీ భావిస్తుంది. మొత్తం ఇరు పార్టీల అభ్యర్థులు గెలుపుపై ధీమాగా ఉండడం గమనార్హం. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఎవరి ఓట్లకు గండి పెట్టారా అని ఇరుపార్టీల సీనియర్ నాయకులు చర్చించుకోవడం గమనార్హం.

## నలుగురు కౌంటింగ్ పరిశీలకుల నియామకం

**నెల్లూరు అర్బన్,జూన్2,ప్రభాతవార్త :** సార్వత్రిక ఎన్నికల 2024 నిర్వాహంలో భాగంగా నెల్లూరు జిల్లాకు సంబంధించి మొత్తం ఎనిమిది నియోజకవర్గాలు,ఒక పార్లమెంట్ నియోజకవర్గం గాను భారత ఎన్నికల సంఘం 04.06.2024 తేదీన ఓట్ల లెక్కింపు కొరకు మొత్తం నాలుగు కౌంటింగ్ పరిశీలకులను నియమించడం జరిగింది.116 కోవూరు ఏసి,117 నెల్లూరు సిటీ ఏసీ,123ఉదయగిరి ఏసీ,22నెల్లూరు పిసి సంబంధించి నితిన్‌సింగ్ భధోరియా ఐఏఎస్‌ను,19 కందుకూరి ఏసి,118నెల్లూరు రూరల్ ఏసి,22 నెల్లూరు పిసి,సంబంధించి రామ్‌కుమార్ గౌతమ్ ఐఏఎస్‌ను,114 కావలి ఏసీ,115 ఆత్మకూరు ఏసీ,22నెల్లూరు పిసి సంబంధించి అభిలాష్ కుమార్ టీజీను,119 సర్వేపల్లి ఏసీ,23తిరుపతి పిసి,జయేంద్ర కుమార్ విజయవత్ నియమించడం జరిగింది.

## పోలంరెడ్డి తండ్రి వెంకురెడ్డికి ఘన నివాళి,



**కొడవలూరు జూన్ 2 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తండ్రి మరియు తెలుగుధేశంపార్టీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తాత పోలంరెడ్డి వెంకురెడ్డి ప్రధమ వర్ధంతిని పురస్కరించుకొని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డ విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గం నాయకులు, తదితరులు వెంకురెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండలం, నార్త్‌రాజుపాలెంలోని పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు మరియు తెలుగుదేశంపార్టీ నాయకులు హాజరైనారు. ఈ సందర్భంగా వెంకురెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు.

## వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,కాకర్ల సురేష్ ల గెలుపు తథ్యం ...అంద్రా బాలగురవారెడ్డి



**వరికుంటపాడు,జూన్ 2,ప్రభాతవార్త :** ఉమ్మడి అభ్యర్థులు నెల్లూరు ఎంపి గా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ఉదయగిరి ఎమ్మెల్యే గా కాకర్ల సురేష్ లు భారీ మెజారిటీతో గెలుపు తథ్యం అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అంద్రా బాలగురవారెడ్డి పేర్కొన్నారు.ఆదివారం అంద్రా బాలగురవారెడ్డి మాట్లాడుతూ ప్రభాతవార్త తో మాట్లాడుతూ సేవే మార్గంగా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సాధించిన ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,కాకర్ల సురేష్ లు అత్యధిక మెజారిటీతో విజయం సాధించనున్నారనీ అన్నారు.నెల్లూరు ఎంపి గా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి విజయం సాధించి ప్రజానీకానికి మరెన్నో సేవా కార్యాక్రమాలతో అభివృద్ది చేస్తారనీ కొనియాడారు.అలాగే ఉదయగిరి నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ అఖండ మెజారిటీతో విజయ దుందిభీ మోగిస్తారనీ ,ఉదయగిరి ప్రజానీకం కాకర్ల కు బ్రహ్మారథం పట్టారనీ కొనియాడారు.కాకర్ల సురేష్ విజయం సాధించి ఉదయగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతారనీ,సామాన్యులకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్న ధీమాను వ్యక్తం చేశారు.యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కాకర్ల సురేష్ ముందజలో ఉంటారని అన్నారు.తెలుగుదేశం,జనసేన,బీజేపి ల ఉమ్మడి అభ్యర్థులైన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,కాకర్ల సురేష్ ల గెలుపు తథ్యంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు,మాజీ సొసైటి అధ్యక్షులు పావులూరి రవీంద్రబాబు,గొడుగులూరి మాలకొండ్రాయుడు,సాయి లు తదితరులు పాల్గొన్నారు.

## అళహరి జనసేనకు ద్రోహం చేసారు జనసేన నేత సిద్ధు



**కావలి రూరల్,జూన్6,ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ పార్టీకి ద్రోహం చేసారని జనసేన నేత సిద్ధు ఆరోపించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్టీ కార్యాలయంలో జనసేన నేతలతో కలిసి సిద్ధు విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగిన ఎన్నికల్లో అళహరి సుధాకర్ జనసేన కార్యకర్తలు పవన్‌కళ్యాణ్ అభిమానుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ప్రవర్తించారని,నిజమైన పార్టీ శ్రేణులను పక్కన పెట్టి కొంతమంది కిరాయి మనుషులను పక్కన పెట్టుకుని వారే నిజమైన పార్టీ అంటూ వైసీపీతో వ్యాపారం చేసి పార్టీకి ద్రోహం చేసారన్నారు.నిజమైన పార్టీ శ్రేణులకు కూటమి అభ్యర్థులకు అండగా నిలబడి వేమిరెడ్డి, కావ్య,కృష్ణారెడ్డిలగెలుపు కోసం శక్తివంచన లేకుండా శ్రమించారన్నారు.కూటమి ఎమ్మెల్యే,ఎంపీ అభ్యర్థులు కావ్య కృష్ణారెడ్డి,వేమిరెడ్డిలు తొలిసారి పోటీ చేసారని,అభివృద్ధి చేసిన వారికే ఓటు వేయమని అళహరి పిలుపునివ్వడంలో ఆంతర్యం వైసీపీ అభ్యర్థులకు ఓట్లు వేయమనేకదా అన్నారు.అళహరి ఇన్‌చార్జ్‌గా పనిచేసే నైతికత కోల్పోయారని,అతనే రాజీనామా చేసి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.అళహరిపై ఆధారాలతో జనసేన అధిష్టానానికి ఫిర్యాదు చేసామని త్వరలో అతనిపై చర్యలు తీసుకుంటారన్నారు.ఈ సమావేశంలో జనసేన నేతలు,పవన్‌కళ్యాణ్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 5 మండలాల కౌంటింగ్ ఎజెంట్లకు టిడిపి శిక్షణ కార్యక్రమం

**కందుకూరు, జూన్2, ప్రభాతవార్త :** జూన్ 4 కౌంటింగ్ జరగనున్న నేపధ్యంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు కార్యలయంలో 5 మండలాల పార్టీ అధ్యక్షులతో శిక్షణా కార్యక్రమం ఆదివారం జరిగింది.కౌంటింగ్ సందర్బంగా తీసుకోవాల్సిన చర్యలు గురించి వారికి లీగల్ టీమ్ వివరించారు.

## సిఎం జగన్ పై దాడి కేసులో సతీష్ విడుదల

**నెల్లూరు క్రైం, జూన్ 2, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై గులకరాయి దాడి కేసులో నిందితుడిగా ఉన్న విజయవాడకు చెందిన వేముల సతీష్ ఆదివారం నెల్లూరు కేంద్ర కారాగారం నుండి బెయిల్ పై విడుదలయ్యారు. కోర్టు ఆదేశాలు మేరకు సతీష్‌కు రెగ్యులర్ బెయిల్ వచ్చిన విషయాన్ని ఆయన తరపు న్యాయవాదులు జైలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు సంబంధించిన పత్రాలను సమర్పించడంతో ఆదివారం జైలు నుండి విడుదలయ్యారు. ఈ సందర్భంగా సతీష్ తరపు న్యాయవాది సలీం మాట్లాడుతూ ఏప్రిల్ 14న తన క్లైంట్ సతీష్ పుట్టిన రోజు సందర్భంగా వేడుకల్లో ఉన్నాడని, కానీ అన్యాయంగా సిఎం జగన్ మోహన్ రెడ్డి పై గులకరాయతో దాడి చేశాడంటూ అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. తీసుకు బెయిల్ రాకుండా అధికార పార్టీ నేతలు రకరకాలుగా అడ్డుకున్నారని, చివరకు హైకోర్టు తమ వాదనలకు సానుకూలంగా స్పందించి బెయిల్ ఇవ్వడం జరిగిందన్నారు. సతీష్ అరెస్టు వెనుక రాజకీయ కుట్ర కోణం దాగి ఉందని ఆరోపించారు. కోడి కత్తి కేసుమలె ఇది కూడా జరిగేదని, చివరకు న్యాయమే గెలిచిందని సంతోషం వ్యక్తం చేశారు.

## కటారి సేవలు చిరస్మరణీయం



**నెల్లూరు, జూన్ 2, ప్రభాతవార్త - వైద్యం :** కటారి తిరుపాలయ్య సేవలను ప్రతి విద్యార్థి ఆదర్శనీయంగా తీసుకోవాలని నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లు, డాక్టర్ సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, నగర పాలక సంస్థ పాఠశాలల్లో చదివి పదవ తరగతి ఫలితాలలో 550 మార్కులు ఆపైన సాధించిన విద్యార్థులకు కటారి తిరుపాలు స్మారక టాపర్స్ అవార్డ్స్ ప్రధానోత్సవం జరిగింది. నెల్లూరు నగరంలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా డాక్టర్ మాదాల వెంకటేశ్వర రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాదించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో పాటు విద్యా సామాగ్రిని ముఖ్య అతిధులు అందచేసి అభినందించారు. ముందుగా అతిధులు అందచేసి అభినందించారు. ముందుగా అతిధులను నిర్వాహకులు సన్మానించారు. కటారి తిరుపాలు సేవలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని పేద విద్యార్థులకు అండగా నిలవాలని వేమిరెడ్డి, మాదాల పిలుపునిచ్చారు. విద్యార్థుల బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓట్లు లెక్కింపు సమయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలి

## కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో విజయసాయి రెడ్డి



**నెల్లూరు రూరల్, జూన్ 2, ప్రభాతవార్త :** ఓట్లు లెక్కింపు సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాజ్యసభ సభ్యులు, వైసిపి నెల్లూరు ఎంపి అభ్యర్థి విజయసాయిరెడ్డి దిశానిర్దేశం చేశారు. నెల్లూరు సిటి నియోజకవర్గ కార్పొరేటర్లు, కౌంటింగ్ ఏజెంట్లతో ఆదివారం రామ్మూర్తి నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ కొణిదెల సుధీర్, పార్టీ నాయకులు జూపూడి ప్రభాకర్ రావు, సన్నపరెడ్డి పెంచల్ రెడ్డి, ఆనం జయకుమార్ రెడ్డి, మనుక్రాంత్ రెడ్డి తదితరులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు కౌంటింగ్ రోజు అనుసరించాల్సిన తీరుపై ఏజెంట్లకు దిశానిర్దేశం చేసారు. కౌంటింగ్ మొదలైన దగ్గర నుండి చివరి వరకు అప్రమత్తంగా ఉంటూ ప్రతిదీ క్షుణ్ణంగా పరిశీలించాలని వివరించారు. అలాగే కౌంటింగ్ ప్రక్రియపై వారికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.



